

ముగిసిన పూజలు

ధర్మపురి: శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా సాగుతున్న మహారుద్ర పూజలు మంగళవారం ముగిశాయి.



పాఠశాల సందర్శన

రాయికల్: కుమ్మరిపల్లి ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన మన ఊరు.. మనబడి పనులను టీపీక్యూసీ రిటైర్డ్ జైపాల్ పరిశీలించారు.



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆరోగ్య మహిళ కార్యక్రమంతో మేలు



మాట్లాడుతున్న సాయిరంగనాథ్

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు వినియోగించుకోవాలని ఆ ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకుడు సాయిరంగనాథ్ కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సిరికొండ, భూషణరావుపేట హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లతో మహిళలకు వైద్యం అందిస్తున్న తీరును మంగళవారం ఆయన పరిశీలించారు. మహిళలు ఎక్కువగా ఏ వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారనే విషయాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్, వైద్యాధికారులు సింధూజ, ప్రతాప్, సూపర్‌వైజర్ భూషణ్, చిన్నరాజన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల



కాలువ ద్వారా వెళ్తున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ మెయిన్ కెనాల్‌కు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీనిద్వారా ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, మల్యాల, గొల్లపల్లి, పెగడపల్లి, ధర్మపురి, రాయికల్, సారంగాపూర్ మండలాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందనుంది. అలాగే, లక్ష్మీ కెనాల్‌కు 100 క్యూసెక్కులు, సరస్వతీ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతలకు 180 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతలకు 135 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 6,995 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 1,090 అడుగులుగా ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 84.810 టీఎంసీలకు చేరింది.

చెరువుల పరిశీలన



కొచ్చెరువును పరిశీలిస్తున్న అధికారులు


కథలాపూర్(వేములవాడ): కథలాపూర్, బీమారం మండలాల్లో భారీవర్షాలకు తెగిపోయిన చెరువులను నీటిపారుదలశాఖ క్వాలిటీ కంట్రోల్ ఈఈ బుచ్చిరెడ్డి, డీఈ శరత్ మంగళవారం పరిశీలించారు. కథలాపూర్ మండలంలో గంభీర్‌పూర్ కొచ్చెరువు, దుంపేట గ్రామంలో ఊర చెరువులకు మొన్నటి భారీ వర్షాలతో గండ్లు పడ్డాయి. బొమ్మెన ప్రాజెక్టు మత్తడి ప్రమాదకరంగా మారింది. బీమారం మండలం రాజలింగంపేట శివారులో గోవిందరాజుల చెరువుకు పడిన గండిని పరిశీలించారు. వాటిని ఎలా మరమ్మతులు చేయాలనే విషయాలపై చర్చించారు. వారివెంట వేములవాడ డీఈ ప్రశాంత్, ఏఈ శ్రీనివాస్, రాజు ఉన్నారు.

సీఎంకు 'పోస్టుకార్డులు'



పోస్టుకార్డులతో రెండో ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ రెండో ఏఎన్‌ఎంలు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పోస్టుకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం వాటిని పోస్టల్ డబ్బాలో వేసి సీఎం కేసీఆర్‌కు పంపించారు. ఈ సందర్భంగా రెండో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు గాండ్ల మాధురి మాట్లాడుతూ ఉద్యోగులను తమ కన్నబిడ్డలతో సమానంగా చూసుకుంటున్న సీఎం కేసీఆర్.. తమ సమస్యను ఆలకించాలన్నారు. 16ఏళ్లుగా జాతీయ ఆరోగ్య మిషన్‌లో రెండో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న తమ సేవలను గుర్తించి రెగ్యులర్ చేయాలని మాధురి విన్నవించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంల సంఘం ప్రతినిధులు మమత, పద్మ, జయప్రద, స్వరూప, సుమలత, ఎలిజబెత్, రాజమణి తదితరులు పాల్గొన్నారు.



కన్నారం నుంచే జైత్రయాత్ర!





"పాత కరీంనగర్.. ఉద్యమాల ఖిల్లా. తెలంగాణ ఉద్యమానికి సమరశంఖం పూరించిన జిల్లా.. ఇక్కడే పార్టీ పునాదులు నిర్మితమయ్యాయి, ఇక్కడ నుంచే తెలంగాణ గళం ఢిల్లీకి వినిపించింది. రెండుసార్లు గులాబీ పార్టీ అధికారంలోకి రావడంలో కరీంనగర్ పాత్ర మరువలేనిది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 12 చొప్పున అసెంబ్లీ సీట్లు గెలుచుకున్నాం. ఈసారి 13 స్థానాలు గెలిచి చరిత్ర సృష్టించాలి. జిల్లాలో పార్టీ గ్రాఫ్ బాగుంది. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉన్నాం. చేసిన పని ప్రజలకు వివరించండి. ఉద్యమ స్ఫూర్తితో ముందుకుపోదాం. ఎన్నికల జైత్రయాత్ర కరీంనగర్ నుంచే మొదలుపెడదాం. అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరాలన్నది సీఎం అభిలాష. ఇది పెద్ద కష్టమేమీ కాదు''

– బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు ఉమ్మడి జిల్లా నేతలతో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చేసిన దిశానిర్దేశం

- 13 స్థానాలు కైవసం చేసుకోవాలె
- గత తప్పిదాలు పునరావృతం కావొద్దు
- ఉమ్మడి జిల్లా గులాబీ లీడర్లకు కేటీఆర్ దిశానిర్దేశం
- గంగుల, హరీశ్, వినోద్, భానుప్రసాద్‌కు అదనపు బాధ్యతలు
- పెద్దపల్లి జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెట్టిన అధిష్టానం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. దాదాపుగా చివరి అసెంబ్లీ సమావేశాలు కావడంతో మంత్రి గంగుల కమలాకర్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు హైదరాబాద్‌లో విందు ఏర్పాటు చేశారు. కొంతకాలంగా చొప్పదండి, రామగుండం ప్రాంతాల్లో నేతలు తిరుగుబాటుకు సిద్ధమవుతున్న వేళ ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. పాత కరీంనగర్ జిల్లాకే చెందిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ స్థితిగతులకు సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద ఉందని... ఎప్పటికప్పుడు తనకు పార్టీ గ్రాఫ్‌పై నివేదికలు అందుతున్నాయని మంత్రి కేటీఆర్ వారితో అన్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇంతకాలం ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ''మూడు గంటల కరెంటు'' వ్యాఖ్యలతో విశ్వసనీయత కోల్పోయిందని... బీసీ బంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు, విద్యా కానుక వంటి పథకాలతో ప్రజల్లో పార్టీ గ్రాఫ్ మరింత పెరిగిందని వివరించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట అందరికీ సానుకూలంగానే ఉందని ప్రశంసించినట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణకు గుండెకాయ అయిన పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి ఎలాగైనా 13 స్థానాలు గెలవాలని.. ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు.

నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలు..

హైదరాబాద్‌లో మంగళవారం మరో కీలక సమావేశం జరిగింది. ప్రతికూల అంశాలు పార్టీ విజయావకాశాలను ఏమాత్రం ప్రభావం చూపకుండా ఉండాలని పార్టీ నిర్ణయించింది. పార్టీలో మెరుగైన గ్రాఫ్ ఉన్న నాయకులను ఇతర నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా నియమించారు. కరీంనగర్‌లో బలమైన అభ్యర్థిగా ఉన్న గంగుల కమలాకర్ (62శాతం గ్రాఫ్)కు అదనంగా చొప్పదండి నియోజకవర్గం అప్పగించారు. మానకొండూరు బాధ్యతలను ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌కు ఇచ్చారు. కీలకమైన హుస్నాబాద్ అసెంబ్లీకి మంత్రి హరీశ్‌రావు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు అభ్యర్థుల బాధ్యతలను ఎమ్మెల్సీ భానుప్రసాద్‌కు అప్పగించారు. జగిత్యాల జిల్లా బాధ్యతలను మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ చూస్తారని తెలిసింది.

పెద్దపల్లి జిల్లాపై స్పెషల్ ఫోకస్..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో పాత జిల్లాలోని కరీంనగర్‌లో ఐదు(తర్వాతి కాలంలో హుజూరాబాద్ బీజేపీ వశమైంది), సిరిసిల్లలో రెండు, జగిత్యాలలో మూడుస్థానాలను బీఆర్‌ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. కానీ... పెద్దపల్లిలో మాత్రం సీన్ రివర్స్ అయింది. అక్కడ మూడుస్థానాలకు ఒకటే గులాబీ పార్టీ గెలుచుకుంది. మంథనిలో శ్రీధర్‌బాబు(కాంగ్రెస్), రామగుండంలో కోరుకంటి చందర్(ఏఐఎఫ్‌బీ)లు విజయం సాధించారు. వెంటనే కోరుకంటి చందర్ గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు కూడా పెద్దపల్లి జిల్లాలో మూడుస్థానాల్లో కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిపై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతుందన్న సమాచారంతో.. ఆ లోటును పూడ్చేందుకు ఎమ్మెల్సీ భానుప్రసాద్‌కు పార్టీ పెద్దపల్లి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

ధర్మపురి: సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకంలో అర్హులైన ప్రతీ ఒక్కరిని గుర్తించి న్యాయం చేస్తామన్నారు. గోదావరి నదీ తీరప్రాంతాల్లో ఆస్తులు, పంటలు నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం అదుకుంటుందని తెలిపారు. వరదలతో శ్మశానవాటికలకు అధికంగా నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు. అనువైన స్థలం ఉంటే కొనుగోలు చేసి శ్మశానవాటికలు నిర్మించాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని తెలిపారు. చాలా గ్రామాల్లో మరుగుదొడ్ల బిల్లులు రాలేదని పలువురు సర్పంచులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని దివాకర ఆదేశించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి పథకంపై అవగాహన కల్పించారు. ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ రమేశ్, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 32 దరఖాస్తులు

జగిత్యాలక్రైం: జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో గల మద్యం దుకాణాలకు మంగళవారం సాయంత్రం వరకు 32 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను సమర్పించాలని ఆయన కోరారు.

సమయం లేదు మిత్రమా..!

- గృహలక్ష్మి, మైనార్టీబంధుకు సమీపించిన గడువు
- అర్హతలు కలిగిన వారు ఆగమాగం
- దరఖాస్తుదారులతో కార్యాలయాలు కిటకిట
- గడువు పెంచాలంటున్న జిల్లావాసులు
- మైనార్టీబంధుకు వచ్చిన దరఖాస్తులు 58

నియోజకవర్గాల వారీగా గృహలక్ష్మికి వచ్చిన దరఖాస్తులు

కరీంనగర్	78
పెద్దపల్లి	1652
జగిత్యాల	274
సిరిసిల్ల	3495
మానకొండూరు	10
మంథని	617
హుజూరాబాద్	186
కోరుట్ల	766
వేములవాడ	2329
ధర్మపురి	566
చొప్పదండి	30
రామగుండం	1900



పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బారులు తీరిన దరఖాస్తుదారులు

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల సీజన్ వేళ రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు చేరవయ్యేందుకు ప్రజాకర్షక పథకాలను అమలు చేస్తోంది. ఇప్పటికే దళితబంధు, బీసీలకు రూ.లక్ష సాయం ప్రకటించగా.. తాజాగా గృహలక్ష్మీ పేరుతో నిరుపేదలకు గృహయోగం కల్పించేలా.. మైనార్టీబంధుతో ముస్లిం, క్రిస్టియన్ వర్గాలవారికీ ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. వంద శాతం సబ్సిడీతో మూడు విడతల్లో సొంత స్థలం ఉన్నవారు ఇళ్లు నిర్మించుకోవచ్చు. అదే మైనార్టీబంధులో వన్‌టైం గ్రాంట్ కింద కుటుంబంలో ఒకరికి రూ.లక్ష అందించనున్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులు అన్నిరకాల ప్రయత్నాలూ చేస్తున్నారు. వీరి అవకాశాన్ని మీసేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. అధిక చార్జీలు తీసుకుంటూ వారి వెన్ను విరుస్తున్నారు. ఈ రెండు పథకాలకు దరఖాస్తు గడువు దగ్గరపడుతుండటంతో దరఖాస్తుదారులు సమయంలేదని అధిక చార్జీలైనా చెల్లిస్తున్నారు.

గృహలక్ష్మి నిబంధనలు

- ఇళ్లు లేకుండా సొంత జాగా ఉండి నిర్మాణం చేసుకునేవారు
- స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు
- తెల్ల రేషన్‌కార్డు కచ్చితంగా కలిగివుండాలి
- కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసు బుక్ జిరాక్స్‌లు జతపర్చాలి
- జీవో 59 కింద లబ్ధిపొందని వారు మాత్రమే అర్హులు

మైనార్టీబంధు నిబంధనలు

- దరఖాస్తుదారులకు వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణాల్లో రూ.రెండు లక్షలకు మించరాదు
- 2023 జూన్ 2వ తేదీ నాటికి 21నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు గలవారై ఉండాలి
- తహసీల్దార్ జారీచేసిన బీసీ సీ, చర్చి పాస్టర్ మంజూరు చేసిన బాపిస్ట్ సర్టిఫికెట్ తప్పనిసరి
- ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు
- కులం, ఆదాయం, నివాసం ధ్రువప్రతాలు తప్పనిసరి
- మంత్రి ఆమోదంతో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ ఎంపిక చేసి మైనార్టీశాఖ ద్వారా అందిస్తారు.

గృహలక్ష్మికి రేపటితో.. మైనార్టీబంధు 14 వరకు గడువు

గూడు నిర్మించుకోవాలని ఎన్నో రోజులుగా ఆశగా ఎదురుచూస్తున్న వారికి ఈ నెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటన జారీ చేశారు. దీంతో వివిధ ప్రాంతాల్లో పనుల కోసం వెళ్లినవారు, స్థానికంగా ఉంటున్న వారు ఆయా పత్రాలు సమకూర్చుకోవడానికి పరుగులు పెడుతున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు కాకుండా కలెక్టరేట్, మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తులు నేరుగా అందించాలనడంపై దరఖాస్తుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మైనార్టీబంధుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14వరకు గడువు ఇచ్చారు. దాని గడువు మరో ఐదు రోజులే ఉండటంతో మైనార్టీలు ఆందోళన చెందుతున్నారు. సరైన సమాచారం లేక ఎవరు ఏం చెబితే వాటికోసం పరుగులు తీస్తూ ఆగమాగం అవుతున్నారు. మీసేవ కేంద్రాల్లో కులం, ఆదాయం, తదితర సర్టిఫికెట్ల కోసం బారులు తీరుతున్నారు. మద్యం దుకాణాల్లో టెండర్లు వేయడానికి కులం సర్టిఫికెట్ అవసరం కావడంతో వారు కూడా పరుగున వస్తుండటంతో రద్దీ పెరుగుతోంది. ఇదే అదనుగా మీసేవ కేంద్రాల నిర్వాహకులు అధికచార్జీలు వసూలు చేస్తున్నారు.

ఇథనాల్ పరిశ్రమకు బ్రేక్

- జనావాసాలకు దూరంగా ప్రభుత్వ స్థలం ఉంటే స్థాపిస్తాం
- అసెంబ్లీలో ప్రస్తావించిన మంత్రి కె.తారక రామారావు
- పరిశ్రమకు అవసరమైన వంద ఎకరాలు లభించడం అనుమానమే..



ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన స్థలం

జగిత్యాల: వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో రూ.750 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఇథనాల్ రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. పరిశ్రమ స్థాపిస్తే పంటపొలాలు దెబ్బతింటాయని, ఎల్లంపల్లి ప్రాజెక్టు నీళ్లు కలుషితమవుతాయని, చుట్టూ ఉన్న పల్లెవాసులు వ్యాధుల బారినపడతారని ప్రజలు ఆదినుంచీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలు పెద్దఎత్తున ఉద్యమాలూ చేస్తున్నాయి. ఈక్రమంలోనే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. పరిశ్రమపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో పరిశ్రమ అంశాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం ప్రతిపాదిత స్థలంలో రూ.13కోట్లతో నేల చదును పనులు చేపట్టారని, దానికి ప్రత్యామ్నాయంగా వంద ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని జనావాసాలకు దూరంగా ఎక్కడ చూపించినా తాము ఇథనాల్ రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమ స్థాపించేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టత ఇచ్చారు. ఆ విషయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఇలా అనువైన స్థలం లభిస్తే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా కర్మాగారం స్థాపిస్తామని మంత్రి వెల్లడించారు. అయితే, జిల్లాలో ఒకేచోట వంద ఎకరాల ప్రభుత్వ స్థలం ఎక్కడా అందుబాటులో లేదని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు అవుతుందా? కాదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కత్తిపోట్లకు గురయ్యాక కాలినడకన లక్ష్మీరాజంను ఆస్పత్రికి తీసుకెళ్తున్న స్థానికులు(సీసీ ఫుటేజీ చిత్రం)

మాటువేసి.. కత్తితో పొడిచి..

- 8లో

జగిత్యాలక్రైం: జిల్లాలోని కోరుట్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజం(45) మంగళవారం ఉదయం దారుణ హత్యకు గురయ్యారు. ఇద్దరు దుండగులు ఓ హోటల్ వద్ద మాటు వేసి అక్కడకు వెళ్లిన లక్ష్మీరాజంను మూడుసార్లు కత్తితో పొడిచి పారిపోయారు.

క్లుప్తంగా

బాలికపై అసభ్య ప్రవర్తన

- ఇద్దరు బాలురపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో ఆదివారం సాయంత్రం బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు బాలురపై కేసు నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ కుటుంబం ఇటీవల ఆ గ్రామానికి వలస వచ్చింది. ఆదివారం సాయంత్రం బాలిక బయటకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు అసభ్యకరంగా ప్రవర్తించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవన్‌రెడ్డిని కలిసిన ఇథనాల్ వ్యతిరేక జేఏసీ

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ వ్యతిరేక జేఏసీ సభ్యులు మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌లను మంగళవారం ధర్మపురిలో కలిశారు. స్తంభంపల్లిలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తన గళం వినిపించినందుకు జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్తంభంపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ జనావాసాలకు అతి దగ్గరలో ఉందని, ఈ పరిశ్రమ వల్ల సమీప గ్రామాలకు ముప్పు వాటిల్లుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలో మాట్లాడగా, మంత్రి కేటీఆర్ స్పందించారని అన్నారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

పెగడపల్లి(ధర్మపురి): పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామానికి చెందిన నల్ల నర్సమ్మ (75) వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సమ్మ గ్రామశివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బంధువులు మంగళవారం వృద్ధురాలి కోసం వెతకగా బావిలో శవమై కనిపించింది. మృతురాలి కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

పూడూర్ సింగిల్‌విండో వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం



డీసీవోకు అవిశ్వాస పత్రం అందజేస్తున్న డైరెక్టర్

కొండగట్టు(చొప్పదండి): మండలంలోని పూడూర్ గ్రామ సింగిల్‌విండో వైస్ చైర్మన్ సావనపల్లి రమేశ్‌పై డైరెక్టర్లు మంగళవారం అవిశ్వాస తీర్మాణం చేశారు. ఈమేరకు డీసీవో రామానుజచారికి 12 మంది డైరెక్టర్ల సంతకాలతోకూడిన లెటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ రమేశ్ అవకతవకలకు పాల్పడుతున్నాడని, వ్యక్తిగత ప్రయోజనాల దృష్ట్యా పదవిని దుర్వినియోగం చేస్తున్నాడని లెటర్‌లో పేర్కొన్నారు.

మాటు వేసి.. కత్తితో పొడిచి..

- కోరుట్లలో బీఆర్‌ఎస్ నేత దారుణ హత్య
- ముసుగులు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు
- హోటల్‌లో టీ తాగుతుండగా లక్ష్మీరాజంపై దాడి
- తీవ్రగాయాలతో కరీంనగర్ ఆస్పత్రిలో మృతి
- ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన
- పట్టణంలో ఉద్రిక్తత – మోహరించిన పోలీసు బలగాలు



లక్ష్మీరాజం(ఫైల్)

జగిత్యాలక్రైం: మంగళవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ప్రశాంతంగా ఉన్న కోరుట్ల క్రిస్టియన్ కాంపౌండ్ వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.. ముసుగులు ధరించి మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు.. మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజం(45)పై కత్తితో దాడి చేయడంతో స్థానికులు భయంతో పరుగులు పెట్టారు. దుండగులు ఆయన మెడపై మూడు సార్లు గట్టిగా పొడిచారు.. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీరాజంను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. ఈఘటనతో కోరుట్ల పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పథకం ప్రకారమే హత్య..

- పోగుల లక్ష్మీరాజం – పోగుల ఉమారాణి దంపతులు.
- బీఆర్‌ఎస్‌కు చెందిన లక్ష్మీరాజం కౌన్సిలర్‌గా గతంలో సేవలు అందించారు. ఆయన భార్య ప్రస్తుతం తొమ్మిదోవార్డు కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నారు.
- అయితే, లక్ష్మీరాజం రోజూ ఉదయం 9గంటలకు క్రిస్టియన్ కాంపౌండ్ సమీపంలోని పోగుల శంకర్ హోటల్‌కు వెళ్లి టీ తాగడం, స్థానికులతో ముచ్చటించడం చేస్తున్నారు.
- ఆయన కదలికలను ఇద్దరు దుండగులు కొద్దిరోజులుగా గమనిస్తున్నారు.
- అయితే, టీ తాగి కూర్చున్న లక్ష్మీరాజం వద్దకు మోటార్‌సైకిల్‌పై మాస్క్ పెట్టుకుని వచ్చిన ఇద్దరు 'అన్నా' అని పిలిచారు.
- అతడి దగ్గరకు వెళ్లి వెంటనే కత్తితో మెడపై మూడుసార్లు పొడిచారు.
- దీంతో లక్ష్మీరాజం గట్టిగా కేకలు వేశారు. టీ తాగేందుకు వచ్చిన వారు భయపడి దూరంగా పారిపోయారు.
- ఇదే అదనుగా దుండగలు మోటారు సైకిల్‌పై తప్పించుకుపోయారు.
- తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీరాజంను తొలుత స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.
- పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు.



లక్ష్మీరాజం మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



కార్గిల్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న యువకులు



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ భాస్కర్



కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన



సంఘటన స్థలంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి విచారణ

కోరుట్లలో ఉద్రిక్తత..

లక్ష్మీరాజంపై దాడి విషయం తెలియడంతో కోరుట్లలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మృతుడి బంధువులు, అనుచరులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కరీంనగర్ నుంచి మృతదేహం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం చేశారు. ఇదేసమయంలో బంధువులు, అనుచరులు ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. హంతకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్ సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అయిలాపూర్‌లో రోడ్డులోని నివాసానికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. భార్య ఉమారాణి బోరున బోరన విలపించగా స్థానికులు కంట తడిపెట్టుకున్నారు. లక్ష్మీరాజంకు కొడుకు, కూతురు ఉన్నారు.

దుండగుల గుర్తింపు..

లక్ష్మీరాజం హత్యలో విత్తనాల నాగరాజు, విత్తనాల త్రిమూర్తులు, పిల్లి సత్యనారాయణ, వంశీ పాలుపంచుకున్నట్లు అనుమానిస్తున్నామని, వారిని పట్టుకునేందుకు ఐదు పోలీసు బృందాలు గాలిస్తున్నాయని డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. నిందితులిద్దరూ మోటారు సైకిల్‌పై పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితులు వాడిన మోటార్‌సైకిల్ వంశీదని సమాచారం. సోమవారం రాత్రి వంశీ నుంచి నిందితులు దానిని తీసుకున్నట్లు తెలిసింది. ఆర్నెల్ల క్రితం హత్యకు గురైన ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ ఈ మోటార్‌సైకిల్‌ను వంశీకి ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం విత్తనాల నాగరాజు, వంశీ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

పాత కక్షలేనా?

- లక్ష్మీరాజం హత్యకు పాత కక్షలే కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- ఆర్నెల్ల క్రితం ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ హత్య కేసులో లక్ష్మీరాజం అనుచరులుగా చెబుతున్న వారు పాలుపంచుకున్నారు.
- దీంతో ఆయన హత్య వెనుక లక్ష్మీరాజం హస్తం ఉందని భావించి ప్రవీణ్‌సింగ్ సన్నిహితులు, అన్నదమ్ములైన విత్తనాల నాగరాజు(30), త్రిమూర్తులు(28).. కలిసి పథకం ప్రకారమే పోగుల లక్ష్మీరాజం హత్య చేశారని పోలీసులకు కొన్ని లభించినట్లు సమాచారం. ఈ ఇద్దరికి మల్లాపూర్ ప్రాంతానికి చెందిన పిల్లి సత్యనారాయణ, కోరుట్లకు చెందిన వంశీ సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతోపాటు రాజకీయ కక్షలతో ఎవరైనా హత్యకు సుపారీ ఇచ్చారా? అనే సందేహాలూ ఉన్నాయి.

వీరిద్దరూ ఇప్పటికే రెండు, మూడు హ త్య కేసుల్లో నిందితులని పోలీసు రికార్డుల్లో ఉంది.

యువకుడి ఆత్మహత్యాయత్నం

హంతకులను కఠినంగా శిక్షించాలని యువకులు కార్గిల్ చౌరస్తా వద్ద సుమారు గంట పాటు రాస్తారోకో చేశారు. ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ కిరణ్‌కుమార్ హంతకులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వటంతో యువకులు ఆందోళన విరమించారు. కాగా, హత్యా స్థలాన్ని ఎస్పీ భాస్కర్ రాత్రి పరిశీలించారు. కాగా లక్ష్మీరాజం మృతికి మంత్రి కేటీఆర్, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావులు సంతాపం తెలిపారు.

తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటి?

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ధర్మపురి: సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ 2014 నుంచి 2023 వరకు ఎమ్మెల్యేగా, విప్‌గా, మంత్రిగా అధికారంలో ఉండి ధర్మపురి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత వివిధ గ్రామాలకు చెందిన సుమారు 200మంది యువకులు జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు ముందు కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు నేటికీ కనిపిస్తున్నాయన్నారు. మంత్రిగా ఉండి చేసిందేమీ లేదని విమర్శించారు. ధర్మపురి సమీపంలోని గోదావరి నీళ్లను కాళేశ్వరం లింక్– 2 ద్వారా కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు తరలిస్తుంటే మంత్రిగా ఉండి ఏం చేస్తున్నారని దుయ్యబట్టారు. శాతవాహన యూనివర్సిటీ, జేఎన్టీయూ నుంచి వంతెనలు, రహదారుల వరకు కాంగ్రెస్ హయాంలోనే నిర్మించామని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో ఒక బస్‌డిపో, పాలిటెక్నిక్, అత్యాధునిక సౌకర్యాలు గల ఒక్క ఆస్పత్రి నిర్మించారా? అని నిలదీశారు. ఎన్నికల సమయంలో ప్రజలను మోసంచేసేందుకు దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు, గృహలక్ష్మి తదితర పథకాలతో ముందుకు వస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో వేలాది మంది యువత నిరుద్యోగులుగా తయారయ్యారని ధ్వజమెత్తారు. గృహలక్ష్మి ద్వారా లబ్ధిదారులకు రూ.3 లక్షలు చెల్లిస్తే ఇల్లు ఎలా పూర్తవుతుందో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంట రుణమాఫీ చేయడం లేదని, వడ్డీ మాఫీ మాత్రమేనని, రైతులు దీనిని గుర్తించాలని కోరారు. నాయకులు మధు, సింహరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల వసతి గృహాల్లో టెండర్లు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ కులాల పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో క్యాటరింగ్, శానిటేషన్, డే నైట్ వాచ్‌మెన్‌లకు సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 9న సాయంత్రం 5 గంటల లోపు జిల్లా సమీకృత కార్యాలయంలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో టెండరు దాఖలు చేయాలని కోరారు. ఈనెల 10న ఉదయం 11 గంటలకు అదనపు కలెక్టర్ సమక్షంలో టెండర్లు ఖరారు చేయడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

- సిరిసిల్లలో మాజీ సర్పంచుల నిరవధిక దీక్షలు ప్రారంభం



దీక్షలో మాట్లాడుతున్న దేవయ్య

సిరిసిల్లటౌన్: తమ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రం అంబేడ్కర్ చౌరస్తాలో నిరవధిక దీక్షలను హైకోర్టు జస్టిస్ చంద్రకుమార్ ప్రారంభించారు. అనంతరం దేవయ్య మాట్లాడుతూ, మాజీ సర్పంచులందరికీ నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని, అర్హులకు డబుల్ బెడ్రూం, హెల్త్‌కార్డులు, బస్‌పాస్‌లు ఇవ్వాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలని, సర్పంచులు, మాజీ సర్పంచులు మృతిచెందితే ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించి రూ.5లక్షలు ఆర్థికసాయం చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ భవనాలు కట్టించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. దీక్షల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, సంభనూరి మల్లేశం, జనగామ నర్సింగరావు, గుర్రం భూపతిరెడ్డి, మ్యాకల శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేశం, గంగస్వామి, సలీం, నారాయణ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పొలంలోనే రైతు మృతి



రమేశ్‌రెడ్డి మృతదేహం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో మంగళవారం ఓ రైతు గుండెపోటుతో పొలంలోనే పడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బోకూరి రమేశ్‌రెడ్డి(45) మంగళవారం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. విద్యుత్ మోటారు ఆన్ చేసేందుకు ఒడ్డుపై నుంచి నడిచివెళ్తున్న క్రమంలో ఆకస్మికంగా గుండెపోటు రావడంతో పొలంలోనే పడిపోయాడు. వెంటనే సమీపంలో ఉన్న తండ్రి చంద్రారెడ్డి వచ్చి పరిశీలించగా మృతిచెందాడు. సమాచారం అందుకున్న భార్య సుజాత అక్కడికి వచ్చి భర్త మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం స్థానికుల సాయంతో రమేశ్‌రెడ్డి మృతదేహాన్ని పొలంలోనుంచి ఇంటికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి కొడుకు ప్రశాంత్, కూతురు లహరి ఉన్నారు.

అంజన్నను దర్శించుకున్న కరీంనగర్ సీపీ



సీపీ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆజనేయస్వామిని మంగళవారం కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గోత్రనామాలపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో బుద్ది శ్రీనివాస్ శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు.

'కొడిమ్యాల ఏపీఎం మాకొద్దు'

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల ఏపీఎం దేవరాజ్ మాకొద్దని మంగళవారం కిందిస్థాయి సిబ్బంది జగిత్యాల పీడీ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. కొన్నిరోజులుగా ఏపీఎం ప్రవర్తన అసభ్యకరంగా మారిందని, ఈనెల 6న నమిలికొండ గ్రామంలో సెంట్రల్ విజిట్ చేసిన సమయంలో కొంతమంది మహిళా సిబ్బందిపై అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. ఏపీఎం విధుల్లో కొనసాగితే కిందిస్థాయి మహిళా సిబ్బంది విధుల్లోకి వెళ్లమని అన్నారు. విచారణ చేపట్టి అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఖని' కళాకారుడికి జాతీయ పురస్కారం

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని జవహర్‌నగర్‌కు చెందిన శ్రీసంతోషి ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు ఒడ్డేపల్లి బానయ్య కుమారుడు సందీప్‌కుమార్‌కు జాతీయస్థాయి జానపద కళారత్న పురస్కారం లభించింది. మేకప్‌మెన్, డ్యాన్స్ మాస్టర్, వాయిద్య కళాకారుడిగా రాణిస్తున్న సందీప్‌కుమార్‌కు ఇటీవల న్యూఢిల్లీలోని తెలంగాణభవన్ అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగిన తార ఆర్ట్స్ అకాడమీ అవార్డుల ప్రదానోత్సవంలో పురస్కారాన్ని అందజేశారు. ఇదే టీంలో కళాకారులుగా రాణిస్తున్న రవి, మూగ రవీందర్, దివాకర్, సింగరవేణి మల్లేష్‌యాదవ్‌లకు కూడా జాతీయస్థాయి అవార్డు దక్కింది.

కలగన్నాడు.. సాధించాడు

- ఆర్‌ఎస్సైగా ఎంపికైన నిరుపేద దళిత యువకుడు



తల్లిదండ్రులతో వినోద్

మల్యాల(చొప్పదండి): చిన్ననాటి నుంచి పోలీస్ యూనిఫాం వేసుకోవాలనే కల సాకారం చేసుకున్నాడు నిరుపేద దళిత యువకుడు జోగు వినోద్. బల్వంతాపూర్ గ్రామానికి చెందిన జోగు రాజయ్య–మణెమ్మ పెద్ద కుమారుడు వినోద్ రెండోప్రయత్నంలో ఆర్‌ఎస్సై ఉద్యోగం సాధించాడు. వినోద్ బల్వంతాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో పూర్తిచేశాడు. కరీంనగర్ కిమ్స్‌లో ఎమ్మెస్సీ మ్యాథ్స్ పూర్తిచేశాడు. పదో తరగతి నుంచే పోలీస్ కావాలనే సంకల్పంతో చదివారు. ఓసారి ఎస్సై పరీక్ష రాసి మూడు మార్కుల తేడాతో ఉద్యోగం సాధించలేకపోయాడు. రెండో ప్రయత్నంలో విజయం సాధించాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధికి చేయూతనందిస్తానన్నాడు. పోలీస్ కావాలనే కల సాకారం కావడానికి అమ్మానాన్న, తమ్ముడి సహకారం ఎంతో దోహదం చేసిందని చెప్పాడు. సమాజమే నా కుటుంబంగా భావించి, ఉద్యోగం చేస్తూ, ప్రజల కష్టాలను తీర్చడంతో తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నాడు.

రైతు బిడ్డలకు ఎస్సై కొలువు

ధర్మపురి: రైతు కుటుంబంలో పుట్టిన ఇద్దరు యువకులు ఎస్సై కొలువు సాధించారు. ధర్మపురి మండలం నాగారంకు చెందిన మేడిశెట్టి పెద్ద తిరుపతి–అమ్మాయి దంపతుల మూడో కుమారుడు కమలాకర్ ఇటీవల వెలువడిన ఎస్సై ఫలితాల్లో ఏఆర్ ఎస్సైగా సెలెక్ట్ అయ్యాడు. అదేవిధంగా మేడిశెట్టి తిరుపతి–గంగజమున కుమారుడు రమేశ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. ఒకే గ్రామానికి చెందిన వరుసకు అన్నదమ్ములైన కమలాకర్, రమేశ్‌లు ఎస్సై పోస్టులకు ఎంపిక కావడంపై ఇరువురి కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వీరిరువురి తల్లిదండ్రులు వ్యవసాయ దారులే.



రమేశ్



కమలాకర్

వెంకటాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



బైక్‌పై నుంచి కింద పడ్డ వెంకటి, వెంకటేశ్

- బైక్‌ను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- తృటిలో తప్పిన పెను ప్రమాదం

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ శివారు జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, 20 మందికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. వెంకటాపూర్‌కు చెందిన తండ్రి కొడుకులు సోమిశెట్టి వెంకటి, వెంకటేశ్‌లు బైక్‌పై జగిత్యాల నుంచి వెంకటాపూర్ వెళ్తున్నారు. ఈక్రమంలో వెంకటాపూర్ గ్రామ శివారులో బైక్‌ను ఒక్కసారిగా మళ్లించడంతో ఎదురుగా వస్తున్న బస్సు బైక్‌ను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఆగింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. తృటిలో పెను ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి స్వల్పగాయాలు కావడంతో కోరుట్ల ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొండగట్టులో బీజేపీ నాయకుల ఆందోళన



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయ ప్రధాన కార్యాలయ భవనం ఎదుట మంగళవారం బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించి మాట్లాడుతూ ఆలయంలో ఇటీవల నియామకమైన స్వీపర్ పోస్టులను టీఆర్‌ఎస్ నాయకులు రూ.2లక్షల చొప్పున అమ్ముకున్నారని అన్నారు. తక్షణమే వారిని విధుల్లో నుంచి తొలగించి స్థానికులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఈవో బుద్ది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగాలకు సంబంధించి కేవలం ఒక్క దినపత్రికలో నోటిఫికేషన్ వేస్తే సరిపోతుందా? అని ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నేరేళ్ల శ్రావణ్ కుమార్‌రెడ్డి నాయకులు గాజుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.